

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ప్రేమ - పగ

**కారు దిగి లోపలికి వస్తున్న భర్తని** చూసి స్పందన ఉసూరుమంది. కనీసం పది నిమిషాల ముందు తను బయట పడనందుకు తనని తను తిట్టుకుంది.

"నువ్వింకా వెళ్ళలేదా?" ఆమెని చూసిన కిరీటి ఆశ్చర్యపోయాడు.

"లేదు. వెళ్తున్నాను" స్పందన చెప్పింది.

"ఇలాగేనా?" ఆమెని ఎగాదిగా చూసి పడక గదిలోకి దారితీసాడు. నిస్సహాయంగా అతన్ని అనుసరించిందామె.

వార్డ్ రోబ్‌లోంచి ఎంబ్రాయిడరీ ఉన్న ఆకుపచ్చ రంగు చీర తీసి మంచం మీద పడేసి చెప్పాడు.

"ఈ చీర కట్టుకుని కెంపులు, పచ్చల సెట్ పెట్టుకో"

"పిల్లాడ్ని ఉయ్యాల్లో వేసే ఫంక్షన్‌కి పాతికవేల చీర కట్టుకుంటే నవ్వుతారేమోనండీ. ఇలా బానే ఉన్నాగా?" గొణిగింది.

"మా అత్తయ్య మీ ఫ్రెండ్ అత్తగారి వైపు చుట్టం. ఆవిడ దీనికి తప్పకుండా వస్తుంది. కిరీటి పెళ్ళాం అంటే ఎలా ఉండాలి? నిన్నీ అలంకరణలో చూసి ఇంటికి వెళ్ళి మామయ్యని సాధించాలి. వాళ్ళ కూతుర్ని నాకిచ్చి చెయ్యనందుకు" కిరీటి కసిగా చెప్పాడు.

స్పందన భర్తవైపు జాలిగా చూసింది.

"అయిపోయిందేదో అయిపోయింది. మనం లక్ష అనుకుంటాం. అనుకున్నవన్నీ అవవు కదా? మీరు నన్ను చేసుకున్నారు. నవీన ఇంకొకర్ని చేసుకుంది. అంతా బానే ఉన్నాం. ఈ కక్ష సాధింపు ఎవరిమీద?"

"నవీన ఎంత బావుండేదో తెలుసా? ముద్ద బంతి పువ్వులా ఉండేది. కిలకిలా నవ్వేది. అమ్మంటే ప్రాణం పెట్టేది. డిగ్రీ అవగానే మామయ్యని నోరు విడిచి అడిగాను. 'నవీనని పెళ్ళి చేసుకుంటాను మామయ్య' అని. దానికాయన రావుగోపాలరావులా నవ్వి 'నీ మొహానికి నా కూతురు కావాలా? నీ డిగ్రీకి ఏం ఉద్యోగం వస్తుంది? నా కూతుర్ని డాక్టర్‌కో, ఇంజనీర్‌కో ఇచ్చి చేస్తాను. నువ్వొక గంతకి తగిన బొంతని చేసుకో' అన్నాడు. పాపం నవీన తండ్రి చాటు పిల్ల. నన్ను మూగగా చూడటం తప్ప ఏమీ చేయలేకపోయింది. ధన్‌బాద్ బొగ్గు గనుల్లో పనిచేసే ఇంజనీర్‌కిచ్చి దాని గొంతు కోసాడు పాపం." కిరీటి డగ్గుత్తికగా ఆగిపోయాడు.

పెళ్ళయ్యాక ఏ ఇరవై రెండువేల సార్లో విన్న ఆ ఫ్లాష్ బేక్‌ని, విసుగు మొహంలో కనపడనీయకుండా మరోసారి విన్నది స్పందన.

"నేనింత సంపాదించానని, నవీన అంత కాకపోయినా ఓ మోస్తరు అందగత్తెనే చేసుకున్నానని, తనని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నానని మామయ్యకి తెలియాలి. నేనేమో వాళ్ళతో పలకడం మానేసాను. అమ్మతోనే రాకపోకలు పోయాయి. మరి ఇలాంటి ఫంక్షన్స్‌వల్లే మన సంగతి వాళ్ళకి తెలిసేది క్విక్ త్వరగా రెడీ అవు. డ్రైవర్‌ని ఉంచుకో." చెప్పాడు.

మౌనంగా అతను చెప్పిన ప్రకారం తయారై బహుమతిని తీసుకుని స్నేహితురాలి ఇంటికి బయలుదేరింది స్పందన.

అప్పటికే అక్కడికి చేరిన స్నేహితులంతా స్పందన అలంకరణ చూసి ఆశ్చర్యపోయారు.

"ఓ ఫంక్షన్‌కి వెళ్ళివస్తున్నాను. ఇంటికెళ్ళి మళ్ళీ తయారయ్యే ఓపిక లేక డైరెక్ట్‌గా ఇక్కడికికి వచ్చాను" అబద్ధమాడింది.

కిరీటి మేనమామ భార్య ఆప్యాయంగా పలకరించింది. ఈ అలంకరణని గుర్తించిన ఛాయలేమీ ఆవిడలో కనపడలేదు.

ఇంటికి రాగానే కిరీటి ఆత్రంగా అడిగాడు.

"అత్తయ్య వచ్చిందా?"

"వచ్చారు"

"నాకు తెలుసు వస్తుందని. నిన్ను తప్పుకు తిరిగిందా?"

"లేదు. బాగా మాట్లాడారు. మీరు ఎలా ఉన్నారు అని అడిగారు."

"హుం" దీర్ఘంగా నిట్టూర్చాడు కిరీటి.

"స్పందనా మా ఊరి నుంచి తెలిసిన వాళ్ళు కోర్టుపనిమీద వచ్చారు. మధ్యాహ్నం లంచ్‌కి వస్తారు. వంటావిడకి చెప్పి స్పెషల్స్ చేయించు. మనం ఇంగ్లండ్ నుంచి తెచ్చిన గోల్డ్ కోటెడ్ బోన్ చైనా డిన్నర్ సెట్‌లో అన్నీ అందంగా డెకొరేట్ చెయ్." ఫోన్‌లో చెప్పాడు కిరిటీ.

"అలాగే. ఎంతమంది?" అడిగింది.

"నేను కాక నలుగురు."

"సరే."

"మాట."

"ఏమిటి?"

"మొన్న బ్రిసాలో కొన్నామే రెడ్ కలర్ భాగల్పూర్ చీర - అది కట్టుకుని పగడాల సెట్ పెట్టుకో"

"ఇంట్లోనే కదండీ?" ఇబ్బందిగా అడిగింది.

"అందుకే పగడాల సెట్ అన్నాను" ఫోన్ పెట్టేసాడు.

మధ్యతరగతి మనుషులైన ఆ నలుగురు కిరీటి వైభవం చూసి బిత్తరపోయారు. అతని ఆతిధ్యానికి ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఏం మాట్లాడితే ఏం తప్పో అని బిగుసుకుపోయారు. వాళ్ళు ఆ కంగారులో కడుపునిండా తినలేదని గ్రహించిన స్పందన జాలిపడింది.

మాటవరసకి చెప్పినట్లుగా కిరీటి వాళ్ళకి తన మామయ్య తనకి చేసిన అన్యాయం గురించి చెప్పి వాపోయాడు. ఈ ఐశ్వర్యాన్ని అనుభవించాల్సిన నవీన బొగ్గు గనుల్లో మసిబారిపోతోందని బాధపడ్డాడు.

వాళ్ళు మౌనంగా విన్నారు. బస్సు టైమవుతోందని బయలుదేరారు. కిరీటి డ్రైవర్ని పిలిచి వాళ్ళని బస్‌స్టాండ్‌లో దింపమని చెప్పాడు.

వాళ్ళు వెళ్ళాక స్పందన చెప్పింది.

"పాపం. మనింట్లోంచి వెళ్ళగానే వాళ్ళు సింహం బోనులోంచి బయటపడినట్లు ఫీలవుతారు."

"ఇప్పుడు వాళ్ళు ఊరెళ్ళగానే మా మామయ్య ఇంటికి వెళ్తారు. నేను వాళ్ళని ఎంత బాగా చూసుకున్నానో, మన ఇల్లు ఎంత బావుందో అన్నీ చెప్తారు. మా నవీనని నాకిచ్చి చేయకుండా ద్రోహం చేసిన మామయ్య కక్కలేక మింగలేక అవన్నీ వింటాడు" కిరీటి ఉత్సాహంగా చెప్పాడు.

"మీ మామయ్య మీకింకో ద్రోహం కూడా చేసాడండీ."

"ఏమిటి?"

"తన కూతురుకి దుర్గ, గాయత్రి, లక్ష్మి లాంటి దేవతల పేర్లు పెట్టి ఉంటే నిమిషానికోసారైనా ఆమె నామస్మరణ చేసే మీకు ఎంత పుణ్యమో వచ్చేది. ప్చ్! నవీన అని నవీన పేరు పెట్టి మీకు ద్రోహం చేసాడు" జాలిగా చెప్పింది స్పందన.

"చాల్లే ఈ మధ్య నీకు నోరెక్కువైంది" కిరిటి నవ్వేసాడు.

ఆ రోజు పోస్ట్‌లో వచ్చిన శుభలేఖని చూసిన కిరీటి ఆనందంగా చెప్పాడు.

"మొన్న మనింటికి వచ్చిన వాళ్ళలో ఒకాయన కూతురి పెళ్ళి మా ఊళ్ళోనే. పెళ్ళి కొడుకు ఎవరో తెలుసా? మా బొగ్గు గని తమ్ముడు. అదే నవీన మరిది. ఈ పెళ్ళికి మనం తప్పకుండా వెళ్ళాలి. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ దాదాపు పదేళ్ళ తర్వాత నవీనని చూస్తాను."

"నేను కూడా రావాలా?" స్పందన ఇబ్బందిగా అడిగింది.

"మరి? ఈ ఇల్లు, ఆస్థిపాస్తులు, ఆడీ కారులాగా నువ్వూ నాకో స్టేటస్ సింబల్. వచ్చి తీరాలి."

స్పందన మనసు చివుక్కుమంది.

"నేను మనిషినండీ" బాధగా చెప్పింది.

"తెలుసు. ఇంజనీరింగ్ చదివిన నిన్ను ఎందుకు చేసుకున్నానో తెలుసా? మామయ్య నవీనకి ఇంజనీర్‌తో పెళ్ళి చేసాడని. మరి ఆ ఇంజనీర్ భార్యని ఓ స్టేటస్ సింబల్‌గా నేను ప్రదర్శించుకోవాలా వద్దా?"

"ఉద్యోగం చేయనప్పుడు ఇంజనీరైనా, ఇంటర్ చదివినా ఒకటే."

"నిజమే కానీ ది గ్రేట్ బిల్డర్ కిరీటి ఇంటర్ చదివిన అమ్మాయిని చేసుకుంటాడా?" నవ్వాడు కిరీటి.

"స్పందనా! పెళ్ళికి వెళ్ళేప్పుడు పచ్చచీర, ఎమరాల్డ్ సెట్, పెళ్ళి టైంలో తెల్లచీర డైమండ్ సెట్, పెళ్ళయాక భోజనాల టైంలో పింక్ చీర  కెంపులసెట్. అన్నీ జాగ్రత్తగా ఓ బ్రీఫ్‌కేస్‌లో సర్దు. పోనీ పెళ్ళి జరిగేప్పుడు బ్లూచీర, సఫైర్ సెట్ కూడా పెట్టుకుంటావా?" హడావిడిగా అన్నీ సర్దుతూ చెప్పాడు కిరీటి.

"అసలే ఎండాకాలం ఊళ్ళల్లో కరెంట్ ఉండదు ఇవన్నీ పెట్టుకుని భారీ భారీగా తిరగలేనండీ" ప్రాధేయపడింది స్పందన.

"మరో సందర్భంలో అయితే నీ మాట వినేవాడ్ని. ఈసారి మాత్రం.. నోవే" ఖచ్చితంగా చెప్పాడు కిరీటి.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే తన ఇంటికి పెళ్ళికి వచ్చినంత సంబరపడిపోయాడు కన్యాదాత. అందంగా, నాజూగ్గా ఆధునిక లక్ష్మీదేవిలా ఉన్న స్పందనని సాదరంగా లోపలికి తీసుకెళ్ళింది పెళ్ళికూతురు.

"ఏరా కిరీటీ ఎలా ఉన్నావ్?" రెండు చేతులూ చాపుతూ ఆప్యాయంగా పలకరించాడు మేనమామ.

తల్లి పోలికలతో ఉన్న ఆయన్ని చూడగానే కళ్ళనీళ్ళు నింపుకుని కిరీటి ఆ చేతుల్లో ఒదిగిపోయాడు.

"బాగున్నాను మామయ్యా. నువ్వేంటి ఇలా ఐపోయావ్?"

"పదేళ్ళ ముసలాడినయ్యాను కదరా. అమ్మాయిని కూడా తీసుకు వచ్చావా?"

"వచ్చింది మామయ్యా.. స్పందనా.. స్పందనా" బిగ్గరగా పిలిచాడు కిరీటి.

కంగారుగా బయటకి వచ్చిన స్పందనతో చెప్పాడు.

"మామయ్య.."

వంగి కాళ్ళకి నమస్కరిస్తున్న ఆమెని ఆపి చెప్పాడాయన.

"నా కూతురులాంటి దానివమ్మాయి. ఈ దండాలేమీవద్దు."

తర్వాత కిరీటితో చెప్పాడు.

"అత్తయ్య చెప్పిందిరా అమ్మాయి సలక్షణంగా ఉందని. చాలా తక్కువ చెప్పింది. సాక్షాత్తూ లక్ష్మీదేవిలా ఉంది."

"నీ అభిమానం మామయ్యా" వినమ్రంగా చెప్పాడు. ఆమె ఇంజనీరని చెప్పాలని గుర్తురాలేదు.

అటుగా వెళ్తున్న ఒకమ్మాయిని పిలిచాడాయన.

"నవీనా! కిరీటి వచ్చాడు"

పదేళ్ళ నుంచి తన భర్త కల్లో కూడా మర్చిపోని నవీనని ఆసక్తిగా చూసింది స్పందన. అందంగానే ఉంది కానీ కొంచెం మొరటుగా ఉంది. చేతులు, నడుము లావుగా ఉన్నాయి.

"బావా బావున్నావా? ఎన్నేళ్ళయిందో నిన్ను చూసి" అభిమానంగా పలకరించిందామె.

"బావున్నాను నవీన. ఏడీ మీ రాజకుమారుడు?" అడిగాడు కిరీటి.

విడిదింట్లో ఉన్న భర్తని అత్తగారి వైపు వారిని పరిచయం చేసింది నవీన.

స్పందన అందంగా జాజిమొగ్గలా ఉందని మెచ్చుకుంది.

నవీన భర్త అందగాడేకాక మంచీ మర్యాద ఉన్నవాడని కిరీటి మెచ్చుకున్నాడు.

పెళ్ళి ఆద్యంతం కిరీటి మేనమామ పక్కనే కూర్చున్నాడు. ఆయనతోనే భోజనం చేసాడు. స్పందన ఏ చీర కట్టుకుని ఏ నగలు వేసుకుందో ఒక్కసారి కూడా గమనించలేదు.

పదేళ్ళ తర్వాత వచ్చిన కిరీటిని గ్రామం వాళ్ళు ఆప్యాయంగా పలకరించారు. పంతం, పట్టుదల, ప్రతీకారం పదం ఏదైనా పదేళ్ళపాటు ప్రతిరోజూ మేనమామని ద్వేషంగా ప్రేమించిన కిరీటి, ఇష్టంగా చేసుకున్న భార్యని, తప్పిపోయిన పెళ్ళికూతురితో పోల్చి కించపరుస్తూ ఆమెని ఓ స్టేటస్ సింబల్‌గా, వస్తువుగా చూసిన కిరీటి వాళ్ళకి తన భార్యని పరిచయం చేసాడు.

ఐతే ఆమె ఇంజనీర్ అనో, లేక ఆమెకి ఐదు కిలోల బంగారం ఉందనో చెప్పలేదు.

"స్పందన నన్ను అర్థం చేసుకుని మా అమ్మలా చూసుకుంటుంది."

కిరీటి దంపతులు తిరిగి పట్నం వెళ్ళేప్పుడు వారి కారులో మేనమామ దంపతులు కూడా ఉన్నారు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story